





ప్రముఖ మాస పత్రిక ‘రచన‘ ప్రారంభించిన కొత్తలో డిసెంబర్ 1991 నుంచీ అక్టోబర్ 1992 వరకూ ఒక వినూత్నమైన ప్రయోగం చేసింది. ‘కథా ప్రహేళిక‘ పేరుతో, రచయిత పేరు బయటపెట్టకుండా, నెల నెలా ఒక కథని ప్రచురించి, రచయితల విశ్లేషణలని ఆహ్వానించింది. ఆ నెల కథాప్రహేళిక లోని కథలో ఉన్న మంచి చెడుల్ని వివరంగా వ్రాయమని, మంచి వ్రాసిన వాళ్ళలో కొంతమందికీ, లోపాల్ని ఎత్తి చూపినవాళ్ళలో కొంతమందికీ నెలనెలా బహుమతుల్ని ప్రకటించింది. ఒకే రచయిత నెల కొకటి చొప్పున 9 కథలు వ్రాసి నెలనెలా పాఠకుల కోర్టులో తీర్పుకోసం నిలుచునే వాళ్ళు. ఈ ప్రయోగం అత్యద్భుతమైన ఫలితాలనిచ్చి, తెలుగు పాఠకుల నాడికి అద్దం పట్టింది. చివరి వరకూ అజ్ఞాతంగా వుండి ఈ కథలన్నింటినీ వ్రాసిన వారు ప్రముఖ రచయిత శ్రీ వి.వి.న.మూర్తి. పాఠకుల తీర్పుకోసం వెలువడుతున్న కథలు కాబట్టి నెలకో రకమైన అంశాన్ని, వివాదాస్పదంగా ఉండే ఇతివృత్తాలని ఎన్నుకుని, వరుసలో ఒక ఆరోహణ, అవరోహణ క్రమాన్ని పాటిస్తూ, పాఠకులని ఆకర్షించడమనేది అంత తేలికైన పని కాదు. ఈ కీలకమైన ప్రక్రియని అవలీలగా నిర్వహించిన వి.వి.న. మూర్తి గారి కథలన్నింటినీ పాఠకుల విశ్లేషణతో సహా ప్రచురించారు వాహినీ బుక్ ట్రస్ట్‌వారు. కథలన్నీ ముగిసాక వాటికొక గ్రేడింగ్ ని కూడా ఆహ్వానించారు. ప్రముఖ రచయిత కాళీపట్నం రామారావు గారు కూడా వాటికి ఒక గ్రేడింగ్ ఇచ్చారు. వీటన్నింటినీ, రచయిత మనసులోని మాటతో సహా కలిపి ప్రచురించిన ఈ పుస్తకం కథారచయితలు కాబోయేవారికి చక్కటి మార్గదర్శి. అభిరుచిగల పాఠకులకి ఒక విలువైన కానుక ఈ పుస్తకం.

**Published by:**
**Vahini Book Trust**
**1-9-286/3, Vidyanagar**
**Hyderabad – 500 044, India**




విదేశాంధ్ర పాఠకులకి, ముఖ్యంగా అమెరికాలోని తెలుగు పాఠకులకి వంగూరి చిట్టెన్‌రాజు గారి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్రతినెలా ‘కౌముది‘ లో (అపుడప్పుడూ వారు బద్ధకించినప్పుడు తప్ప!) వస్తున్న అమెరికామెడీ కి వస్తున్న విశేషమైన ప్రతిస్పందనే ఇందుకు ఓ నిదర్శనం. ఆయన గత ఐదారు సంవత్సరాలుగా అక్కడక్కడా వ్రాసిన కథలన్నింటినీ (అన్నీ హాస్య కథలే అని వేరుగా చెప్పాల్సిన అవసరం లేదనుకుంటాను) కలిపి అమెరికామెడీ కథలు అనే పేరుతో ప్రచురించారు. సాధారణంగా హాస్య రచనలు అనగానే ఎదుటి వారి బలహీనతల్ని ఎగతాళి చేస్తూ నవ్వించాలనే ప్రయత్నాలు ఎక్కువ. ఐతే తననీ, తన కుటుంబసభ్యులనే ఎక్కువగా ఈ హేళనకి టార్గెట్‌లుగా చేసుకుని ఎవరినీ నొప్పించకుండా, అవసరమైన చోట తమమీదే జోక్‌లు వేసుకుని, కడుపుబ్బ నవ్వించే ఆరోగ్యకరమైన హాస్యం గుప్పించడం చిట్టెన్‌రాజు గారి ప్రత్యేకమైన శైలి. 24 కథలున్న ఈ సంపుటిని గత సంవత్సరం - ఆంధ్రదేశం లోని ప్రముఖ నగరాలన్నింటిలో ప్రముఖులు - ఆవిష్కరించారు. (విజయవాడ ఆవిష్కరణ సభలో పాల్గొనే అవకాశం ‘కౌముది‘ కి లభించింది). వంగూరి ఫౌండేషన్ వారి 25వ ప్రచురణగా వెలువడిన ఈ పుస్తకం తెలుగు హాస్యప్రియులంతా తప్పక చదివి తీరాల్సిన నవ్వుల పువ్వుల కదంబం..!

Published by
Vanguri Foundation of America Inc.
PO Box 1948, Stafford
TX 77497, USA
Ph. 281-277-0445

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు , తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా ‘కౌముది‘ విజ్ఞప్తి చేస్తోంది.

Editor
KOUMUDI(Web Monthly)
4251 Escudo Ct
Dublin, CA 94568,USA